# నువ్వంటే నాకెంతో ఇష్టం!

## దమయంతి

పదకొండున్నరయింది ఆఫీసులో అడుగు పెడుతూ చూశాను. నీలంచీర అమ్మాయి.

మేనేజరుతో మాట్లాడుతోంది ఎదురుగా కూర్చుని. ఆశ్చర్యమో ఆనందమో తెలీని స్థితిలో నా కాళ్ళు ఆగాయి. ఆ అమ్మాయిని వెనకనుంచిగానీ పక్కలనుంచిగానీ వెయ్యిమందిలోనైనా చూసి పోల్చుకోగల సాన్నిహిత్యం నాకుంది. ఆ అమ్మాయిని అలా చూసిన క్షణం నా కళ్ళలో మెరిసిన మెరుపుని నేనైతే చూడలేదుగానీ గ్రహించాను.

ఆరునెలల తర్వాత మళ్ళీ ఇక చూడలేనేమో అనుకొంటున్న సమయంలో చూసినప్పుడు నాలో కలిగిన ఉద్వేగాన్ని ఆపే శక్తి నాకు లేకపోయింది.

"ఏం బ్రదర్ అలా చూస్తున్నావ్, మేనేజరుగానీ ముద్దిస్తున్నాడా?" అటుగా వస్తూ అన్నాడు కుమార్ - అతనికి నా దగ్గర చనువుంది.

"అదేంకాదుగానీ ఎవరా అమ్మాయి?" అన్నాను కుమార్ అటుకేసి చూశాడు,

"బాగుంది కదూ?" రహస్యంగా అన్నాడు.

"నోర్మూసి అసలు విషయం చెప్పు"

"కొత్త క్లర్కు. ఈరోజే చేరింది" చెప్పాడు.

"మన ఆఫీసులోనే!?"

"అక్షరాలా"

"హౌనైస్" నాలో నేనే అనుకొంటున్నట్టుగా అన్నాను.

"నీకుగానీ తెలుసా ఆ అమ్మాయి?" అడిగాడు కుమార్ నన్ను.

"ఊ" అనబోయి "ఆమె తెలీదు" అన్నాను.

"పేరేమిటి?"

"తెలీదింకా ఉండు -- కనుక్కోస్తా" కుమారు అదేపనిమీద వెళ్ళాడు.

సీటు దగ్గరకి నడిచాడు. నమ్మలేకపోతున్నాను. కానీ కళ్ళకెదురుగా కనబడుతుంటే నమ్మకుండా ఎలా ఉండటం?

ఆ అమ్మాయిని మొదటిసారిగా నీలంరంగు చీరలో చూశాను. చిన్నప్పటినుంచీ నాకు ఆ రంగంటే చిరాకు. అటువంటిది ఆ అమ్మాయిని ఆ రంగు చీరలో చూడగానే నీలం రంగుకి ఇంత అందముందా అనిపించింది. ఆలోచించగా అది ఆ అమ్మాయి కట్టుకున్నందువల్లే అని తేలింది.

సీట్లో కూర్చున్నాను గానీ ఏ పనీ తోచడంలేదు. లేచి టాయిలెట్ కేసి నడిచాను. అద్దంలో చూస్తూ తల దువ్వుకొని బయిటికి వచ్చాను

నా గుండె ఓ క్షణం ఆగినట్టుంది. ఆ అమ్మాయి నాకేసి చూసింది.

ఆగిన గుండె పెరిగి అతివేగంగా కొట్టుకోడం నాకు స్పష్టంగా తెలుస్తోంది.

"ఎందుకిలా నావెంట పడతావ్?"

ఆ అమ్మాయి వేసిన ప్రశ్నతో నాకు లోకం తెలిసింది. సర్దుకున్నాను

"నేనా!?" అన్నాను అయోమయంగా

"అవును" అంది తడుముకోకుండా.

ఆ అమ్మాయి బింకంచూస్తే ఏడిపించాలనిపించింది.

"మరొకరెవరూ పడకుండా" అన్నాను నవ్వుతూ.

"షటప్"

"..  .."

"చూడు నిన్నుచూస్తే నా కసహ్యం"

"కానీ నాకుమాత్రం ఆ అభిప్రాయం లేదు" అన్నాను.

"దయచేసి నావెంట పడకు" అని చాలా పొగరుగా అంది.

"దయచెయ్యక పోతే?" కావాలనే అడిగాను.

"ఏం చెయ్యాలో నాకు తెలుసు."

"ఓ. కె. ప్రొసీడ్ వెన్. ఆల్ ది బెస్ట్".

రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. ఏదోఒకటి మాట్లాడుతూ ఆ అమ్మాయిని ఆపాలనీ దాంతో ఆమెని మరి కాస్సేపు దగ్గరగా చూసే అవకాశం ఉంటుందనీ చేసిన నా ప్రయత్నం ఫలించలేదు.

ఎంతో మంచిగా మాట్లాడాలనుకొన్న నా నిర్ణయాల్ని ఆ అమ్మాయి మాటతీరు మార్చేస్తుంది. ఆమె గొంతులో ధ్వనించే పొగరు నన్ను మొండిగా ప్రవర్తించేలా చేస్తుంది అది నా బలహీనత కావచ్చు.

సీట్లోకొచ్చి కూర్చున్నాను కుమార్ వచ్చాడు హడావిడిగా

"గురూ ఆ అమ్మాయి పేరు తెలిసింది" అన్నాడు

"ఏమిటి" నాలో ఆసక్తి నాకు తెలీకుండానే బయట పడింది.

"చెబితే ఏమిస్తావ్?" అదేదో పెద్ద విషయం అన్నట్టు ఊరించాడు నన్ను

"నీ బొంద నీకివ్వడ వేమిటి నువ్వు చెప్పక పోయినా తెలుస్తుంది" అన్నాను

"అదీ నిజమే. కాబట్టి నేను చెప్పడమే మంచిది ఆ అమ్మాయి పేరు అనురాధ" అన్నాడు. అని నా మొహంలోకి చూసాడు

"సరే. పోయి సీట్లో కూరో - మేనేజర్ చూస్తున్నాడు" అన్నాను. కుమార్ వెళ్ళిపోయాడు.


అనురాధ! అందానికి తగ్గ పేరు కానీ ఆ గర్వం ...

జేబులోంచి పాకెట్ డైరీ తీసి మొదటి పేజీలు తిప్పాను, ఇదెలా సాధ్యం? అంతు బట్టడంలేదు అలా ఎంత సేపుకూర్చున్నానో తెలీదు.

"సార్ మేనేజరు పిలుస్తున్నారు" ప్యూన్ చెప్పాడు-వినిపించింది.

పావు గంట తర్వాత తిరిగొచ్చి సీట్లో కూర్చున్నాను. టేబుల్ పైన కాగితాల కదుల్తున్నా ఆలోచనలు వదలడం లేదు.

అనురాధని మొదటిసారి 123 నెంబరు బస్‌లో చూశాను నిర్మల్ ఇండస్ట్రీ స్టాపులో ఎక్కి కోఠి సర్కిల్ దగ్గర దిగిపోయింది. ఆ అమ్మాయిని చూసిన మొదటి క్షణం నా మనసు ఇదీ అని చెప్పలేని ఓ స్థితికి చేరుకుంది పరిసరాలని మరిచిపోయి ఆ అమ్మాయిని కళ్లార్ప



కూడా చూశాను బస్ దిగేవరకూ. నేనలా చూడటానికి కారణం ఆ అమ్మాయి అందమే అని చుట్టుపక్కల వాళ్ళనుకొన్నా, ఆ అభిప్రాయాన్ని అవుననీ కాదనీ అనగలిగే స్థితిలో లేను నేనప్పుడు. ఆ అమ్మాయిని చూసినప్పుడల్లా రోజూ ఇదే పరిస్థితి ఎదురైంది నాకు.

ఆ అమ్మాయికి విడవకుండా ఎప్పుడూ

అంటిపెట్టుకుని తిరిగే ఓ స్నేహితురాలు ఉంది. గర్వం కేవలం మా ఇద్దరి సొత్తు అన్నట్టుగా ఉండేది వాళ్ళ ప్రవర్తన బస్‌లో. అందమూ, గర్వమూ ఒకేచోట కలిసి ఉంటాయన్నమాట వాస్తవమైతే ఆ అమ్మాయి అందగత్తెననీ, ఆ అందగత్తెకి గర్వం ఆభరణమనీ ఒప్పుకుని తీరాలి.

అదే నాకు బాధకలిగించిన విషయం. ఆ అందమైన నల్లని కళ్ళలో పొగరుకి బదులుగా వినయం తొంగిచూస్తే .. అనుకొంటాను నేనిప్పటికీ. ఆమెకి నేనుగుర్తున్నాననీ నేనంటే తనకి కోపమనీతెలుసు. అందుకు నేనేం చెయ్యాలి?

ఆమెని చూడకుండా, చూస్తే, మాట్లాడకుండా ఉండలేని నా బలహీనతని ఎలా దారికి తేవాలి?

రోజూ బస్‌లో మూడోసీటు దగ్గర నిలబడి తనని చూస్తుండటం ఆమెకి తెలుసు. దానికి సూచనగా మొహంలో చిరాకు స్పష్టంగాకనిపించేది. నా గురించి స్నేహితురాలితో ఏదో చెప్పడమూ ఆ పిల్ల తలతిప్పి నాకేసి చూసి నవ్వుతూ ఏదో అనడం అన్నీ నాకు తెలుసు. ఆమె నా పట్ల చూపే విముఖత కొద్దిరోజుల్లోనే నాకు అర్థం అయినా నా ప్రవర్తనలో మార్పు రాకపోవడం నాకే ఆశ్చర్యాన్ని కలిగించేది.

ఆ రోజు బస్‌లో ఎప్పటిలా నుంచున్న నేను ఆమె పుస్తకాల మధ్య నుంచి ఏదో జారిపడటం గమనించాను. అందుకని చూశాను. బస్‌పాస్. విమన్స్ కాలేజీలో బిఎస్సీ చదువుతోందని తెలిసింది, పేరు చూసేంతలో ఆమె చూసింది. ప్రపంచంలో వున్న అసహ్యాన్నంతటినీ తన మొహంలోకి ఎరువు తెచ్చుకుందా అనిపించింది నాకా క్షణంలో.

"ఇది మీదే అనుకుంటాను... "

నమాట పూర్తికాకముందే నా చేతిలోని బస్‌పాస్‌ని దాదాపులాక్కున్నట్టుగా తీసుకుంది. కనీసం థాంక్సయినా చెప్పకుండా గబాల్న అటుతిరిగి నుంచుంది

నేనొక జులాయి వెధవననీ తనని గమనించడమే నాపని అనీ ఆమె అభిప్రాయం దానికి తగినట్టుగా బస్‌లోనే కాకుండా విడిగా మేమిద్దరం అక్కడక్కడ తారసపడటం జరిగేది. ఇద్దరం ఒకేరూట్‌లో ఉండటం కారణం కావచ్చు.

ఓ ఆదివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో సుల్తాన్‌బజార్ దగ్గర బస్టాండులో నుంచున్న నాకు ఆమె కనిపించింది.

ఒంటరిగా ఆ సమయంలో అక్కడ చూడడంతో ఆశ్చర్యంతో పాటు ఆనందమూ కలిగిన మాట నిజం.

ఆమె నన్ను చూసింది, ఓక్షణం ఆగి తిన్నగా నా దగ్గరకొచ్చింది. ఆమె ధైర్యం ఆక్షణంలో నా కర్థం కాలేదు

"చూడు మిస్టర్. ఆడపిల్లల వెనక పడటం తప్ప నీకేం పనిలేదా?"

ఈసారి నిజంగానే ఆశ్చర్యపోయాను. అంతలో నాకో సందేహం కలిగింది. మాఇద్దర్లో ఎవరికి వెనక ఎవరు పడుతున్నాం అని. ఆమె మొహం చూస్తే

నవ్వొచ్చింది నాకు ఉడికించాలని పించింది.

"ప్రస్తుతానికదే పని" అన్నాను.

రోషంగా చూసింది నాకేసి.

"జాగ్రత్త త్వరలో మరో పని తగలొచ్చు హాస్పిటల్లో" అని అక్కడ మరో క్షణం నిలవకుండా జనంలో కలిసి పోయింది.

ఆమె చూపులో, మాటలో ఎంత గర్వముందో ఆ నడకలోనూ అంతే గర్వ ముందనిపించింది ఆ క్షణంలో ఆమెని చూస్తే. అయితే సిటీలో ఒంటరిగా తిరిగే ఆడపిల్లలకి ఆ మాత్రం ధైర్యం ఉండటం అవసరం అని కూడా అనిపించింది.

కానీ పరీక్షలు అయిపోయి ఆమె బస్‌లో రావడం మానేసిన రోజున నా మనసు పడిన అవస్థ నాకీ రోజుకీ గుర్తుంది.

అనురాధని మళ్ళీ ఇలా చూస్తానని అనుకోలేదు. ఆఫీసులో ఆమెని చూసినప్పుడు మొదటనే నెంత ఆశ్చర్యపోయనో నన్ను చూసి అనురాధ కూడా అంతే ఆశ్చర్యపడి వుండాలి

"నీకీ విషయం తెలుసా?"

లంచ్ అవర్లో కుమార్ అన్నాడు నాలుగు రోజుల తర్వాత

"ఏ విషయం?" అన్నాను ఏమీ పట్టనట్టుగా

"అనురాధకి పెళ్ళయిందన్న విషయం".

"వ్వాట్? నిజంగా!" ఈసారి నా ఆసక్తిని ఆపలేకపోయాను. అనురాధ మొహం చూడటమే తప్ప మిగతావి

100 ml బాటిలు కొని

87 పైసలు ఆదా చేసుకోండి

'క్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగు:
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
డిస్ట్రిబ్యూటర్లు కావలసినవారుగాను ప్రకటించుచున్నాము.




తయారు చేయువారు:
కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ
751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081

పట్టించుకోనందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

"అలా ఆశ్చర్య పోతున్నావ్ నీకే మాత్రమైనా ఆశ వంటిది ఉందేమిటి. ఎందుకైనా మంచిది అలాంటివేం పెట్టుకోకు. ఆవిడి కసలే ముక్కు మీద కోపం-ఆపైన బోల్డంత గర్వం"

అనేసి సమాధానంకోసం చూడకుండా వెళ్ళిపోయాడు కుమార్.

అయితే కుమార్ చెప్పిన ఈవిషయం కూడా నాలో మార్పుని తేలేకపోయింది.

ఎందుకు నేనంటే ఆమెకంతకోపం? ఏమిటి నేను చేసిన నేరం? నాకేసి ఎందుకంత చిరాగ్గా జూస్తుంటి?

ఒక్కొక్క మనిషిని చూస్తే ఒకొక్క రకంగా అనిపిస్తుందికాబోలు. అది నా అదృష్టమూ ఆమె దురదృష్టమూనా?

ఆరోజు అనురాధ ఆఫీసుకి రాలేదు. రోజూ అనురాధని చూడటం అలవాటై ఆమె కనబడక పోతే మనసంతా అదోలా ఏమీ తోచక పిచ్చిపట్టినట్టుగా ఉంది. మర్నాడు ఆమె రాకకోసం చూస్తూహాల్లో నుంచున్నాను. గుమ్మంలో ఎదురైంది అనురాధ.

"ఏమిటలా చూస్తావ్?" చీదరించుకున్నట్టుగా అంది.

"మీ మొహాన్ని" అన్నాటక్కున. ఆమె వాలకం నేను ఏం మాట్లాడుతున్నానో తెలీకుండా చేస్తోంది.

"పిచ్చిగా వాగకు. తల్చుకుంటేనిన్ను ఏమైయినా చెయ్యగలను" అంది.

"సంతోషం. అంటే నన్నింకాతల్చుకోలేదన్నమాట".

"ఛీ! ఇక్కడ కూడా నీ మొహం ఎదురవుతుందనుకొంటే అసలీ ఉద్యోగంలో చేరేదాన్ని కాదు" అంది ముందుకు నడుస్తూ.

"ఇప్పుడైనా మించిపోయింది లేదు. వదలిపెట్టవచ్చు."

ఆగి చురుక్కున చూసింది. తర్వాత అంది.

"నీలాంటి వాడికి భయపడేంత పిరికిదాన్ని కాదు"

"నాకు తెలుసా సంగతి."

"ఏమిటి?"

"మీ ధైర్యం గురించి"

"ఇంకా తెలుసుకోవల్సింది చాలా వుంది. ఇప్పుడు నన్ను రక్షించుకోడానికి మరో మనిషి వున్నారని గుర్తుంచుకో" అంది.

"తప్పకుండా. కానీ పొరపాటున ఎప్పుడైనా మర్చిపోతే?" ఆమెతో పాటు ఓ అడుగు ముందుకి వేస్తూ అన్నాను.

"అనుభవిస్తావు" చరచరా వెళ్ళిపోయింది.

ఆ మొహంలో ఎంతకసి, ఎంత ద్వేషం! ఏమిటి నేను చేసిన పాపం?"


వారంరోజుల తర్వాత -

ఆఫీసు నుంచి బయటకొచ్చి నడుస్తున్నాను. పని ఎక్కువగా ఉండి లేటయింది, అలసటగానూ చిరాగ్గానూ ఉంది. పది నిముషాలు నడిస్తేగాని బస్టాప్ రాదు

"ఎయ్ మిస్టర్"

ఎవరో పిలిచారు వెనక్కి తిరిగి చూశాను. ఎవరూ లేరు. తిరిగి నడక సాగించాను.

"నినే"




ఆగి పక్కకి చూశాను

అతను నాకేసే వస్తున్నాడు అతన్ని ఇదివరకు ఎక్కడా చూసినట్టు లేదు ఎవరై ఉంటాడు అని ఆలోచిస్తున్నాను

"గంగాధర్ నువ్వేనా?"

అతని ముఖంలోకి పరీక్షగా చూశాను గుర్తురాలేదు

"అవును మీరెవరు?" అన్నాను

"నేనెవరో తర్వాత తెలుస్తుంది ముందు పద" అన్నాడు నడుస్తూ. నేను అనుసరించాను నడుస్తూ

"నీకు తల్లి తండ్రులున్నారా?" అడిగాడు

"లేరు" అతని గురించి ఆలోచిస్తునే చెప్పాను

"పెళ్లాం పిల్లలు?'

"ఊహూ" అతన్ని గురించే అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నాను.

"అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు?"

"ఎవరూ లేరు"

"అందుకే పిచ్చి వేషాలేస్తున్నావా?" సూటిగా నాకేసి చూస్తూ అన్నాడు.

"అంటే?"

"నిన్ను పడేసి తన్నినా నీగురించి ఏడ్చేవాళ్ళు పట్టించుకునే వాళ్ళు లేరని వెర్రి వేషాలేస్తున్నావా అని" తీక్షణంగా చూశాడు నాకు అర్థం కాలేదు

"ఏమిటి నీతో మాట్లాడటం?" అన్నాను

"కాదోయ్ ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం" అన్నాడు

ఎవరై ఉంటాడితను? అనురాధ నా పైకి పంపించి ఉంటుందా? నాలో తెగింపు చోటు చేసుకుంది

"నా ఇష్టం, అడగటానికి నువ్వెవరు?" అన్నాను మొండిగా

"నీ ఇష్టమూ. అయితే ఇది నా ఇష్టం" అంటూ మరో మాటకోసం ఆగకుండా అరచేత్తో నా దవడ పగిలేలా కొట్టేడు. తేరుకొనేలోగానే ఎడంచేత్తో కాలర్ పుచ్చుకుని మొహంపైనా భుజాలపైనా ఎడా పెడా కొట్టేశాడు. నాకు కళ్లు తిరిగినట్ట

యింది. ఒళ్ళు తూలుతుంటే పడకుండా నిలదొక్కుకునే ప్రయత్నించేశాను.

"జాగ్రత్త మళ్ళీ రాధ జోలికొచ్చావా ఇంతకంటే ఘనంగా సన్మానిస్తాను నిన్ను" అని జరిగింది నేను అర్థంచేసుకొనేలోగానే గబగబ అడుగులేస్తూ వెళ్ళిపోయాడు

అప్పుడు చూసుకున్నాను నా ముక్కునుంచి రక్తంకారుతోంది కన్ను అప్పటికప్పుడే వాచిపోయి కనిపించటం మానేసింది ఎముకలన్నీ పిరిగొట్టినట్టు బాధగా ఉంది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. కొంతదూరం నడచి ఆటోఎక్కి రూంకి చేరుకున్నాను.

ం ం ం ం

అమీర్‌పేటలో బస్సుదిగి నాగార్జున నగర్ కాలనీకి వెళ్ళాను. నన్ను చూడగానే సరళ ఆంటీ చిన్నబుచ్చుకుంది మొహాన్ని

"ఏం బాబూ, ఆరోజు తీరిక లేకపోయిందా?" అంది నిష్టూరంగా. నాకు తెలుసు ఆంటికి కోపంవస్తుందని

కొడుకు డాక్టరు అతని పెళ్ళికోసం తొందరపడుతోంది. పుట్టినరోజుసాకుతో గొప్పవాళ్ళందర్నీ పార్టీకి పిలిచింది పోయిన ఆదివారం. ఆవిధంగా కొడుక్కి సంబంధం వెతుక్కోవచ్చని. ఫోన్‌చేసి ప్రత్యేకంగా చెప్పినా నేను రాలేదని కోపం

"తీరికలేక కాదు ఆంటీ చాలేక రాలేదు."

"అదేం? అంది.

"నీకు తెలుసుగా" నవ్వాను అదోలా.

"లోపలికిరా" అంది. ఆవిడ వెనకే వెళ్ళాను

"చూడు, ఒంటరి వాడివికావడం నీ నేరంకాదు. నిన్ను తమలో కలుపుకోలేకపోయేవాళ్ళది తప్పు" అంది. ఫ్రిజ్ తలుపు తెరిచి మంచినీళ్ళు నా కందిస్తూ.

మంచినీళ్ళు తాగాను. ప్రాణంలేచివచ్చినట్టయింది ఆంటీ చేత్తో ఏదిచ్చిన అలాగే ఉంటుంది ఈ ప్రపంచంలో నాకు ఆత్మీయులై ఉన్నారంటే అది సరళ ఆంటీ ఒక్కతే ఆవిడలో తల్లి ప్రేమని చూడగలిగాను.

"బాధపడకు రాలేదన్న బాధతో అన్నాను" అంది నాతలమీద చేయ్యేసి నిమురుతూ

"లేదు ఆంటీ అదినా బలహీనత. విడివిడిగా వంద మందిలో మాట్లాడుగలను కానీ అందరితో కలసి, అందరి ఎదటా ఏ ఒక్కరితోనూ మాట్లాడలేను అందుకే నలుగుర్లోకి రాలేను"

"ఫోం చేసావా?" అడిగింది నాకేసి చూస్తూ

"ఊఁ "అన్నాను.

"నిన్ను చూస్తుంటే అన్నం తిన్నట్టు లేదు ఆదేం అలా ఉన్నావ్ ఒంట్లో బాగోలేదా?" అంటూనే నా నుదుటి పైన చెయ్యివేసి చూసింది. ఆవిడ చేతిని అలాగే పట్టుకున్నాను

"పద అన్నం తిందువుగాని" అంది

"ఒద్దు ఆంటీ ఆకలి లేదు"

"అది అబద్ధమని నాకు తెలుసు ఆకలి మొహం ఒక్క తల్లికే తెలుస్తుంది. నేనూ ఒక బిడ్డకి తల్లినే' పద" అంది

"ఆంటీ ఓ మాట అడగనా?" ఫోం చేస్తూ అన్నాను.

"అడుగు"




"ఏదైనా మనికిష్టమైనా దాన్ని రోజూ చూస్తుండాలంటే ఏం చెయ్యాలి?"

అంటీ ఒక్కసారి నా మొహంలోకి చూసి అంది

"అది మనది కాకపోతే సొంతం చేసుకోవాలి"

"అది మరొకరి సొత్తు అయిపోయినప్పుడు??"

"మనమే పని గట్టుకుని వెళ్ళి చూస్తే సరి"

"అది వాళ్ళకిష్టం లేనప్పుడు?"

"మన ఇష్టాన్ని చంపుకోవాలి"

"అది సాధ్యం కానప్పుడో?"

"ఏవిటీ ప్రశ్నలు - ఎందుకడుగుతున్నావ్ ఇవన్నీ?" అంది ఆంటీ

"సమాధానం చెప్పు ఆంటీ"

"వస్తువుని మిగలకుండా నాశనం చేస్తే మనశ్శాంతి దొరుకుతుందీ అంటే ఆ పని చెయ్యాలి"

"నో ఆంటీ అది వీలుకాదు - అది నాశనం కావటానికి వీల్లేదు ఎక్కడ వున్నా అది బాగుండటమే కావాలి"

"అప్పుడు ఒకటే మార్గం మనమే దానికి దూరంగా వెళ్ళి అది మనకళ్ళబడకుండా, దాని జోలికి పోకుండా ఉండాలి. అది సాధ్యం కాకపోయినా తప్పదు"

నేను ఆలోచించాను.

"గంగా ఏమిటలా ఉన్నావ్ ఒంట్లో బాగుందా?"

ఆంటీ కంగారుపడింది నా వాలకం చూసి.

"థాంక్స్ ఆంటీ" అన్నాను.

"అయినా ఏమిటిదంతా?" అడిగింది

"త్వరలో తెలుస్తుంది"

"నిన్ను చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుంది గంగా ఇక లాభం లేదు. నీ బాధ్యతకూడా నీకిష్టం లేకపోయినా నేనే తీసుకుంటాను" అంటున్న సరళ ఆంటీని చూస్తుంటే ఈవిడని తల్లిగా పొందిన మురళి ఎంత అదృష్టవంతుడనిపించింది

"అంత శ్రమ అక్కర్లేదు ఆంటీ. సమయం మించిపోయింది" అన్నాను

"ఏమీ కాదు. సమయం ఎప్పుడూ మించిపోదు. మించకుండా మనం చూసుకోవాలి" అంది.

రాత్రి పొద్దుపోయేవరకూ కూర్చుని లేచి వచ్చేశాను

○ ○ ○ ○

మనసంతా చిరాగ్గాఉంది. ఏపని చేసినా శాంతం అనేది లేకుండా అయింది, ఫలితంగా ఒకచోట స్థిరంగా నించోలేక పోతున్నాను. ఏ పనిమీదా మనసులగ్నం చేయలేపోతున్నాను. అశాంతిగా వుంది పిచ్చి పడుతుందేమోనని భయంగానూ వుంది. మనసులో అసలు ఆలోచనలనేవి లేకుండా ఖాళీగా బండబారినట్టుగా ఉంది

డైరీ తెరిచి మొదటిపేజీ తిప్పాను

గత కొన్నిరోజులగా జరిగిన సంఘటనలూ కలిగిన మార్పులూ తల్చుకుంటే ఎందుకిలా జరిగింది అన్న ప్రశ్న తలెత్తింది.

ఆరోజు నాపైన అకారణంగా చెయ్యి చేసుకున్నది అనురాధ భర్తఅని తెలుసుకున్నాను. ఓ శనివారం మధ్యాహ్నం ఆఫీసు అయిపోయినతర్వాత అనురాధని స్కూటర్ పైన తీసుకువెళుతుండగా చూశాను జరిగినదంతా అనురాధ ప్రోద్బలంపీదే అని మొదట ఊహించక పోయినా ఆతర్వాత ఆఫీసులో అనురాధ ప్రవర్తన దాన్ని బలపరిచింది. ఆ సంఘటనతర్వాత అనురాధ తను ఏదో సాధించినట్టు మరింత గర్వంగా తలెత్తుకు తిరగటం చూశాను ఎప్పుడైనా ఎదురుపడినప్పుడు మరీ పొగరుగా నా జోలికొస్తే ఏం జరుగుతుందో చూశావుగా అన్నట్టు నిర్లక్ష్యంగా ఓ చూపు పారేసి మరీ వెళుతోంది.

ఆ చూపునే భరించలేకపోతున్నాను, అనురాధ మొహంలో నాకు నచ్చనిది అదొక్కటే

పదిరోజులు సెలవుపెట్టి రూంలో కూర్చుని ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చాను ఇంత జరిగినతర్వాత ఇంకా ఆలోచించడం మంచిది కాదనిపించింది. ధైర్యం చెయ్యాలి తప్పదు. గత నెల రోజులుగా నేను చేస్తున్న ప్రయత్నం ఫలించింది. ఇక నిర్ణయం ఒక్కటే మిగిలింది

రెండురోజులు ప్రయత్నించిన మీదట అనురాధని ఒంటరిగా కలుసుకోగలిగాను రికార్డు రూంలో,

"అనురాధా " పిలిచాను. నా గొంతు నాకే వింతగా ధ్వనించింది

తలెత్తి చూసింది అనురాధ ఆ కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. వాటికి నేను బలైపోక తప్పదనిపించింది ఇంకా ఆలస్యంచేస్తే.

"ఏం. ఇంకా బుద్ధిరాలేదా?" అంది.

నేన సమాధానంచెప్పలేదు, నాచేతిలో వున్న కాగితాన్ని ఆమెకి అందించబోయాను

"ఏమిటిది, ప్రేమలేఖా?" అలా అడగటం ఆమె ఒక్కదానికే చాతనవుతుందనిపించింది. తనకి నాపట్లవున్న ఏహ్యాభావాన్నంతటినీ తన గొంతులో నింపుకొని అడిగింది.

"చూస్తే తెలుస్తుంది". చేతినిముందుకి చూపి అందుకోమని చూపులతోనే అర్థం

చాను.

"అనవసరం" ఖచ్చితంగా అంది.

"ప్లీజ్"

అనురాధ కంపరంగా చూసింది.... నా ఉనికినే భరించలేనట్టు చీదరింపుగా చూసి,

"ఛీ" అంది. అంటూనే నాచేతిలోంచి కాగితంమడతని లాక్కుని ముక్కలు ముక్కలుగా చింపి నా కళ్ళముందే డస్ట్‌బిన్‌లో పడేసి విసురుగా బయటికి వెళ్ళిపోయింది.

అయోమయంగా నుంచున్న నాకు కుమార్ రాకతో తెలివివచ్చింది. అను రాధ చర్య నా గుండెని తూట్లు పొడి చింది. ఆమె అలా చేస్తుందనిగానీ చెయ్య గలదనిగానీ నేనూహించలేదు.

"ఏం బ్రదర్ ఒట్లో బాగోలేదా?" కుమార్ అడుగుతున్నాడు.

వినిపించుకునే స్థితిలోను. సమాధానం చెప్పకుండా ఆఫీసునుంచి బయటకు వచ్చి ఆటో ఎక్కి సరాసరి రూంకి చేరుకు న్నాను.

నా అవస్థని ఎవరి చెప్పుకోను?ఏమని చెప్పుకోను? వున్న ఒక్క అవకాశము లేకుండా చేసింది అనరాధ.

అనురాధ ఆఫీసుకి వచ్చి అయిదు రోజులైంది. నాలో ఆరాటం పెరగ సాగింది. ఏదో జరిగింది. ఏం జరిగింది? ఏందుకు రావటం లేదు? ఒక వేళ ఉద్యోగం మానేస్తే? ఉహూ అలా జర గదు. మరైతే ఆఫీసుకి రాక పోడానికి కారణం?

అనాలోచనలు ఒక రూపాన్ని చేరక ముందే ఆరో రోజున ఆ ఫీ సు కొచ్చింది అనురాధ. మనిషి చిక్కి పోయింది మొహం నీరసంగా కళా విహీ నంగా ఉంది ఆ రోజంతా ఆమెని చూస్తూనే గడిపాసేను నేను. అనుకున్నది జరగ లంటే ధైర్యం చెయ్యాలి. ఆ ధైర్యం సాయంత్రం ఆఫీసు మూసే సమయానికి వచ్చింది.

అనురాధ సీటు దగ్గరకి నడిచాను ఇంటికి వెళ్ళ బోయే ప్రయత్నంలో ఉంది.

"మీతో మాట్లాడాలి" అన్నాన.

అనురాధ తలెత్తి నాకేసి చూసింది. ఆ కళ్ళలో భావాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించి ఆఖరుసారి ఓడిపోయాను

"ఏమిటి?" అంది

"ఒక్క అయిదు నిముషాలు కూర్చోండి" అన్నాను.అనురాధ చుట్టూ చూసింది అప్పటికేఆఫీసలో చాలామంది వెళ్ళి పోయారు.

"వీల్లేదు నేను వెళ్ళాలి" అంది మొండిగా.


"వెళ్ళే ముందు అయితో నిముషాలు కూర్చోక తప్పదు. నేను చెప్పేది వినకా తప్పదు" అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకు తెలీదు

అనురాధ నిస్సహాయంగా చూసింది. ఆమె మొహంలో కొత్తగా భయంచోటు చేసుకుంది,

"భయంలేదు నేనేం చెయ్యను"

అయిష్టంగనే కూర్చుంది అనురాధ

"నేనేదైనా చెయ్యాదల్చు కుంటే అటువంటి అవకాశాలు అది వరకు చాలా వచ్చాయి" అన్నాను అనురాధ మాట్లాడ లేదు, ఎటో చూస్తూ కూర్చుంది.




"ఇది చూడండి"

జేబులోంచి పాకెట్ డైరీ తీసి మొదటి పేజీ తిప్పి ఆమె కిచ్చాన.

"ఏమిటది?" అందుకుని చూసింది

"ఫోటో"

"ఎవరిది?" తెల్లబోయి చూస్తూ అడిగింది

అచ్చుగుద్దినట్లు మీ పోలికలే వున్నాయని ఆశ్చర్యంగా ఉందికదూ?"

"ఎవరిమే?" మళ్ళీ అడిగింది.

"మా అమ్మ"

"వ్వాట్!?"

"అవును. మీపట్ల ఇష్టాన్ని పెంచుకోవడానికి, మీరు అసహ్యించుకుంటున్నారని తెలిసినా మీ ముహంలోకిఆశగా చూడటానికి కారణం, మీపట్ల నా అభిప్రాయం అర్థమైందనుకొంటాను."


ఆగి ఆమె మెహంలోకి చూశాను మవునంగా ఫోటోకేసి చూస్తూ కూర్చుంది. మొహం పాలిపోయినట్టుగా వుంది. ఆమె మనసులో తుఫాను రేగుతోందని నాకు తెలుసు.

"నాకు ఊహవచ్చే సమయానికి మా అమ్మ ఈ లోకంలోలేదు. ఏక్షణాన మిమ్మల్ని చూశానో మీ మొహంలో మా అమ్మరూపం, నా మనస్సులో అమ్మ గురించిన ఆలోచనలు కదలసాగాయి. అన్నవాళ్ళు లేకుండా పెరిగాను తల్లి ప్రేమ ఎలావుంటుందో తెలీదు రోజూ మిమ్మల్ని చూస్తూ అమ్మని వూహించుకొంటూ ఆనందపడేవాడ్ని కానీ నా ప్రవర్తన ఎటువంటి పరిణామాలకి దారి తీస్తుందో బాగా తెలిసింది మిమ్మల్ని చూడకుండా, మీతో మాట్లాడకుండాబతకలేననుకున్నాను. కానీ తప్పదు. మీకు నా పట్ల వున్న అభిప్రాయం తెలిసింది. ఇంతకంటే ముందుకిపోవడానికి మీకు మరో

అవకాశాన్నివ్వను. నేను ఎక్కడవున్నా మీరు సుఖంగా ఉండటమే నాకు కావలసింది. అందుకే నేనీ ఊరు వదిలిపెట్టి వెళుతున్నాను. ఏన్నో ఆనందాలు నాకు దూరమవుతాయి జీవితంలో. అందులో ఇదొకటనుకుంటాను. వస్తాను గుడ్‌బై."

చెప్పదలుచుకున్నది అయిదు నిముషాల్లో ముగించి అక్కడ మరొక్క క్షణం నిలవకుండా బయటికి వచ్చేశాను.

నా వెనక అనురాధ మొహాన్ని చూడటానికి, ఆమె భావాలు చదవడానికి ఇప్పుడు నాకు అవకాశంలేదు ★

గెలవండి

రు. 20,000

మొదటి బహుమతి : రాజ్‌దూత్ మోటార్ సైకిల్, టి.వి మోడల్ మొత్తం; 21 లేక రూ. 5000/-(ఏదో ఒకటి)

కన్సొలేషన్ బహుమతి : సగంధరకే అమ్మకం అభివృద్ధి ప్రకారం 101 జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్

సంస్థాపకులదే తుది నిర్ణయం.

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

పైన ఇచ్చినవిధంగా కాగితంపై 9 చతురస్రాలు గీయండి. 5నుండి 13వరకు అంకెలని వుపయోగిస్తూ, నిలువుగా, అడ్డంగా, ఐమూలగా మొత్తం కూడితే 27 రావాలి, ఒక అంకె ఒక్కసారే ఉపయోగించాలి. మొట్టమొదట మాకు అందిన ఎంట్రీకి సఫారీసూట్ ఉచితంగా ఇస్తాము ఎంట్రీలు 15 రోజులలోగా మాకు చేరాలి.

INTERNATIONAL AGENCY (J )

Chhapeti ALIG RH


రచయితలకు ఒక ముఖ్య గమనిక

జ్యోతి, భాగ్యలక్ష్మి నవలల పోటీకి పంపే రచనలకి మా ఎడ్రస్ స్పష్టంగా

జ్యోతి మాసపత్రిక, పి బి. నెం 1824, హైదరాబాదు-20

అని వ్రాయవలసిందిగా కోరుతున్నాము.